స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహన సేవను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. వేసవి సెలవులు కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.24,30,131 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సబ్ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 26 : ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీనియర్ నాయకుడు రచ్చ గోవర్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వారు పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన క్వింటాకు రూ.500 బోనస్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదయ్య, రాములు, యాదగిరిరెడ్డి, బీరయ్య, కవిత, అంజయ్య పాల్గొన్నారు.

ఒంటరి పిల్లలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 26 : మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన యాట పాండు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. అతని భార్య ఆరేండ్ల క్రితం మరణించడంతో వారి ముగ్గురు కుమార్తెలు ఒంటరి వారయ్యారు. తల్లిదండ్రులు కొల్పోయిన పిల్లలకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పులిగిళ్ల నర్సయ్య, అతని స్నేహితుల సహకారంతో రూ.36వేల ఆర్థిక సాయం చేశారు. ఆ డబ్బును పిల్లల పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి శుక్రవారం పాసు పుస్తకాలు అందజేశారు.

ఒంటరి పిల్లలకు బ్యాంకు పాసు పుస్తకాలు అందజేస్తున్న హెచ్ఎం నర్సయ్య

చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రం-1లో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 26 : మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ -1 కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ దంతూరి భాగ్యమ్మ మాట్లాడుతూ ప్రాథమిక విద్య భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని, క్రమశిక్షణతో సమాజంలో మెలగడానికి ఎంతగానో దోహదపడుతందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతోపాటు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీని పూర్తి చేసి పంపించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

రహీంఖాన్‌పేట, కూరెళ్ల ప్రధాన రోడ్డు వెంట పచ్చని చెట్లు

పల్లె రోడ్డు వెంట అల్లుకున్న పచ్చదనం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 26 : కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో భాగంగా మండలంలోని రహీంఖాన్‌పేట నుంచి కూరెళ్ల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 2016లో వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షించారు. అవి ఏపుగా పెరిగి రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం అల్లుకుంది. రోడ్డు వెంటే వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు, గొర్లకాపరులు చెట్ల నీడన సేదతీరుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందుతూ హరితహారం చేపట్టిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వడ్డెర కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య

మోత్కూరు, ఏప్రిల్ 26 : వడ్డెర కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన పల్లపు సమ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డెరుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని ఈ సందర్భంగా సమ్మయ్య అన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్ పామ్ తోటల పట్ల జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అన్నపూర్ణ



జిల్లాలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 27 : వేసవిలో ఆయిల్ పామ్ తోటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి జి.అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. జిల్లాలో సుమారు 750 మంది రైతులు 3600 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే మొక్కలు త్వరగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. వేసవిలో ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నందున సరైన నీటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలని, ప్రతి మొక్కకు ఇరువైపులా 40 లీటర్ల డిశ్చార్జ్ అయ్యే మైక్రో జెట్లు అమర్చుకోవాలని, వేసవిలో చిన్న మొక్కలకు రోజూ వంద నుంచి 150 లీటర్ల నీరు అందించాలని సూచించారు. ఒకటి నుంచి 3 సంవత్సరాల వయస్సు గల తోటల్లో మూడు అడుగుల దూరంలో జనుము, పచ్చిరొట్ట ఎరువు వేసుకోవాలని, దీని వల్ల మొక్కలకు చల్లదనంతోపాటు ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. మూడేండ్లలోపు మొక్కలకు పువ్వు గుత్తులు ప్రతి నెలా రెండు సార్లు తొలగించాలని, రైతులకు అందించిన డైరీల్లో సూచించిన విధంగా పోషకాలను తప్పనిసరిగా అందించాలని పేర్కొన్నారు.

నీరు తక్కువ అయినా మొక్క చనిపోదని, తిరిగి నీరు అందిస్తే చిగురిస్తుందని తెలిపారు. కావున రైతులు ఈ వేసవిలో తమ తోటలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆమె సూచించారు.

ఈతకు వెళ్లి తండ్రీకొడుకు మృతి

- ఆత్మకూరు(ఎం) మండలం రాయపల్లిలో విషాదఛాయలు

ఈతకు వెళ్లిన బావి

నరేశ్ (ఫైల్)

మృతిచెందిన సాయికుమార్

మోటకొండూరు, ఏప్రిల్ 26 : కొడుకుకు ఈత నేర్పించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి తండ్రీకొడుకు మృతిచెందారు. ఈ విషాద సంఘటన మోటకొండూరు మండలంలోని చాడ గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎం) మండలం రాయపల్లి గ్రామానికి చెందిన బోడ నరేశ్ (42) మండల కేంద్రంలో నివాసం ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మోటకొండూర్ మండలం చాడ గ్రామంలో బంధువుల ఇంటికి పండుగకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఆ గ్రామంలో వ్యవసాయ బావిలో తన ఇద్దరు కుమారులకు ఈత నేర్పించేందుకు తీసుకెళ్లాడు. ఈత నేర్పే క్రమంలో ప్రమాదవశాత్తు నరేశ్‌తోపాటు చిన్న కుమారుడు సాయికుమార్ (11) నీటిలో మునిగి మృతి చెందారు. బావి బయట ఉన్న పెద్ద కొడుకు చంద్రశేఖర్ కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఎంత ప్రయత్నించినా ఆచూకీ దొరుకకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది వచ్చి మృతదేహాలను వెలికితీశారు. బాలుడు ఆత్మకూర్(ఎం) ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు.

తండ్రీకొడుకు మృతిచెందడంతో వారి స్వగ్రామం రాయపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తేజంరెడ్డి తెలిపారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 26 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ శాలోమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, గుండాల మండలం వంగాల గ్రామంలో అదనంగా ఐకేపీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 8,483 మంది రైతుల నుంచి 85,549 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 35 కోట్ల రూపాయలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని, ప్రతి కేంద్రంలో 25 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మిల్లర్ల కోసం కొనుగోలు కేంద్రాల దగ్గరలో ఉన్న ఏఎంసీ గోదాములను తెరిచామని.. వర్షాలు, ఇతర అవసరాల దృష్ట్యా వాటిని స్టాక్ పాయింట్లుగా వినియోగించడం జరుగుతుందని తెలిపారు. బీహార్‌లో ఎన్నికల దృష్ట్యా హమాలీల కొరత రాకుండా మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఇతర హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించామని తెలిపారు. ట్రక్ షీట్లను కొనుగోలు కేంద్రాలకు వెంటనే పంపాలని హెచ్చరించామని, తద్వారా ట్యాబ్ ఎంట్రీలు, రైతుల పేమెంట్లు పెరిగాయని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణాధికారులకు ధాన్యం గ్రేడ్లపై అవగాహన కలిగించామని, మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేయవద్దని ట్రేడర్స్‌ను హెచ్చరించామని తెలిపారు. కొన్ని ప్రదేశాల్లో వరికోత యంత్రాల కాంట్రాక్టర్ల ఒత్తిడి వల్ల రైతులు పంట చేతికి రాకముందే కోసి కొనుగోలు కేంద్రాలకు తెస్తున్నారని, తద్వారా తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ధాన్యం నాణ్యతగా ఉండదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పంట కోతలపై ఏఓలు, ఏఈఓలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు త్వరపడి ముందుగా కోయరాదని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమస్యలపై ఫిర్యాదులకు మండల స్పెషల్ ఆఫీసర్ల ఫోన్ నెంబర్లను కొనుగోలు కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. ఎలాంటి సమస్యలు, ఫిర్యాదులు అయినా టోల్ ఫ్రీ నెంబరు 7995120554కు తెలుపాలని రైతులకు సూచించారు.

మహిళ పై గొడ్డలితో దాడి

దాడిలో గాయపడిన సోని

బీబీనగర్, ఏప్రిల్ 26 : పాత కక్షలతో మహిళపై మరో మహిళ గొడ్డలితో దాడికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన సోని శుక్రవారం ఉదయం ఉపాధి హామీ పని కోసం వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గుండెబోయిన మౌనిక వెనుక నుంచి గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. పాత కక్షలతోనే దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సోని భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రమేశ్ తెలిపారు.

తెల్లాపూర్ హుడా కాలనీ నుంచి ఓఆర్ఆర్ ఈదుల నాగులపల్లి వరకు నిర్మించిన రోడ్డు

ఐటీకి కనెక్టివిటీ!

శివార్లలో తీరుతున్న ట్రాఫిక్ చిక్కులు

కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపుతోనే ఐటీ కారిడార్‌లో మెరుగైన రోడ్ నెట్ వర్క్

తెల్లాపూర్ నుంచి ఈదులనాగులపల్లి వరకు లింకు రోడ్ల నిర్మాణం

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా అత్యంత మెరుగైన రోడ్డు నెట్ వర్క్‌ను నిర్మించడమే లక్ష్యంగా చేసుకొని హెచ్ఎండీఏ శివారు ప్రాంతాల్లో కొత్త రోడ్లు నిర్మిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం మహానగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చిన 33 రేడియల్ రోడ్లతో పాటు వాటికి అనుసంధానంగా లింకు రోడ్ల నిర్మాణం చేపట్టింది. కొత్తగా లింకు రోడ్ల నిర్మాణంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో పట్టణీకరణ మరింత వేగవంతమైంది. ఇప్పటి వరకు 137కు పైగా లింకు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టగా, వీటిలో ఐటీ కారిడార్ పరిధిలోనే ఎక్కువగా త్వరితగతిన పూర్తయ్యాయి.

నిర్మాణం పూర్తయిన రెండు రోడ్లు..

ఐటీ కారిడార్‌లోని తెల్లాపూర్ నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్డు నంబరు 7ను నిర్మించాలని ప్రతిపాదించారు. కేసీఆర్ ప్రభుత్వం రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్ పేరుతో తెల్లాపూర్ హుడా కాలనీ నుంచి ఓఆర్ఆర్ ఈదుల నాగులపల్లి మీదుగా మోకిల-కొండకల్ రోడ్డు వరకు రోడ్డును నిర్మించింది. గచ్చిబౌలి హెచ్‌సీయూ నుంచి గోపన్‌పల్లి మీదుగా వట్టినాగుల పల్లి వరకు మరో రహదారి నిర్మాణం చేపట్టింది. ఐటీ కారిడార్‌ను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో నివాస ప్రాంతాలు పెద్ద మొత్తంలో విస్తరిస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ సైతం గణనీయంగా పెరుగుతున్నది. దీంతో మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రహదారుల నిర్మాణంతో పాటు ఇప్పటికే చేపట్టిన రేడియల్ రోడ్ల నిర్మాణాలను మరింత ముందుకు పొడిగించేలా హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. రేడియల్ రోడ్డు 30కి పొడిగింపుగా కొత్తగా నల్లగండ్ల హుడా కాలనీలోని రేడియల్ రోడ్డు 7తో అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టింది. అవసరం ఎక్కడ ఉందో గుర్తించి, అక్కడ క్షేత్ర స్థాయిలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతో పాటు స్థానిక మున్సిపాలిటీ అధికారులతో కలిసి లింకు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోనే భారీ ఎత్తున గేటెడ్ కమ్యూనిటీ, హైరైజ్ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మెరుగైన రోడ్ నెట్ వర్క్‌ను కల్పించేందుకు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా లింకు రోడ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా చేపట్టిన రెండు రేడియల్ రోడ్డు, వాటికి అనుసంధానంగా లింకు రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇవి అందుబాటులోకి వస్తే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఇక్కట్లకు చోటు ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.లింకు రోడ్ల ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు భారీగా ఊరట కలగడంతో పాటు సమయం, ఇంధనం సైతం ఆదా అవుతుందంటున్నారు.

తెల్లాపూర్ నుంచి శంకర్‌పల్లి వరకు....

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో నిజాంపేట, కొంపల్లి, దుండిగల్, అమీన్‌పూర్‌తో పాటు ఐటీ కారిడార్ వైపు ఉన్న తెల్లాపూర్, నార్సింగి, మణికొండలు ఉన్నాయి. తెల్లాపూర్ నుంచి శంకర్‌పల్లి వరకు ఒక లింకు రోడ్డును నిర్మించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెల్లాపూర్ నుంచి ఈదులనాగులపల్లి వరకు రహదారిని నిర్మించారు. అక్కడి నుంచి మోకిల్, కొండకల్ ప్రాంతాలను కలుపుతూ శంకర్‌పల్లి వరకు రోడ్డును నిర్మిస్తున్నారు. ఇలా శివారు ప్రాంతాల్లో ఔటర్ రింగు రోడ్డు లోపలి వైపు, బయట వైపు ఉన్న ప్రాంతాలను కలుపుతూ.. కొత్త రోడ్లను నిర్మించడంతో మెరుగైన రోడ్డు నెట్ వర్క్ ఐటీ కారిడార్ వైపు అందుబాటులోకి వస్తోంది.

'సికింద్రాబాద్'కు సమన్వయ కర్తలు

నియోజకవర్గ, డివిజన్ల వారీగా సీనియర్ నేతలకు బాధ్యతలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ లోకసభ స్థానానికి సంబంధించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గ సమన్వయకర్తలను నియమించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి పార్టీ సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్లా సోహెల్, సికింద్రాబాద్‌కు మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, అంబర్‌పేటకు సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, సనత్‌నగర్‌కు పార్టీ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ముషీరాబాద్‌కు మాజీ ఎమ్మెల్సీ సలీం, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, నాంపల్లికి ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, ప్రభాకర్ రావు, ఖైరతాబాద్‌కు సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌లను నియమించారు. ఆయా డివిజన్లకు సమన్వయకర్తలుగా నియమించగా.. వెంకటేశ్వర కాలనీకి కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఖైరతాబాద్‌కు పార్టీ సీనియర్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి, జూబ్లీహిల్స్‌కు కార్పొరేటర్ వెంకటేశ్, బంజారాహిల్స్‌కు మాజీ చైర్మన్ విప్లవ్‌కుమార్, హిమాయత్‌నగర్‌కు హేమలత బాబు యాదవ్, సోమాజిగూడకు పార్టీ సీనియర్ నాయకులు ఆశిష్ యాదవ్‌లను నియమిస్తూ కేటీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో అందరిని సమన్వయం చేసుకుంటూ , సరికొత్త ప్రణాళికలతో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా సమన్వయకర్తలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

ఏరోస్పేస్‌లో ఆవిష్కరణలు ప్రోత్సహించేలా..

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఏరోస్పేస్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ హబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఏరోస్పేస్ రంగంలో ఎంతో అనుభవమున్న కొలిన్స్ ఏరోస్పేస్ కంపెనీతో జత కట్టింది. టీహబ్ వేదికగా ఇప్పటికే స్కైరూట్ స్పేస్, ధ్రువ ఏరోస్పేస్ వంటి స్టార్టప్ కంపెనీలు ఎంతో విజయవంతంగా ఆ రంగంలో తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఏరోస్పేస్ రంగంలో మరిన్ని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఔత్సాహికుల స్టార్టప్ వ్యవస్థాపకుల కోసం టీహబ్‌లో వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డైనమిక్ ట్రావెల్ టైమ్, డిజిటల్ ప్రొడక్ట్ పాస్‌పోర్టు, రియల్ టైమ్ వెదర్ డేటా ప్యూజన్, మెటా సర్ఫేస్ డిస్‌ప్లే వంటి అంశాల్లో ఆవిష్కరణలు చేసే వారికి ప్రోత్సాహం అందించనున్నారు. ఔత్సాహికులు లింకు (https://bit.ly/49KhwiB)లో సంప్రదించాలని, మే 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

తరగతి గదుల్లో ఏఐ

'ఇంగ్లిష్ జ్ఞానీ' పేరుతో యాప్

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) పరిజ్ఞాన్ని అన్ని రంగాల్లో విస్తృత్తంగా వినియోగిస్తున్నారు. సరికొత్త అప్లికేషన్లు రూపొందిస్తూ అన్ని రకాల కార్యకలాపాలకు ఏఐ తప్పనిసరి అన్నట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఏఐ కేంద్ర బిందువుగా మారింది. దాన్ని కేంద్రంగా చేసుకునే రకరకాల అప్లికేషన్లు, టూల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా, గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలోని పరిశోధక బృందం కొత్తగా తరగతి గదుల్లో ఆంగ్ల భాషలో సమర్థవంతమైన విద్యాబోధనకు అవసరమైన యాప్‌ను రూపొందించింది. 'ఇంగ్లిష్ జ్ఞానీ' పేరుతో రూపొందించిన ఈ వెబ్ అప్లికేషన్‌ను ప్రాథమికంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగాత్మకంగా పరిశీలించామని అప్లికేషన్ రూపకర్తలో ఒకరైన ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థ సీనియర్ రీసెర్చ్ సైంటిస్టు అర్జున్ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు ఆంగ్లంలో నేర్చుకునే వనరులు చాలా తక్కువగా ఉన్నాయి. దీన్ని అధిగమించేందుకు రాజ్ రెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీ (ఆర్‌సీటీఎస్)లోని పరిశోధకులు ఇంగ్లిష్ మాట్లడం, చదివేందుకు సమర్థవంతంగా ఉపయోగపడేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పనిచేసే 'ఇంగ్లిష్ జ్ఞానీ' పేరుతో ఒక టూల్‌ను రూపొందించామన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ వెబ్ అప్లికేషన్‌ను మరోసారి ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఉపాధ్యాయులతో ఉపయోగించి, వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని తుది అప్లికేషన్‌ను దేశ వ్యాప్తంగా ఇంగ్లిష్ భాషా బోధనలో వినియోగించేలా ఈ పరిశోధన కొనసాగుతుందని అర్జున్ రాజశేఖర్ వివరించారు.

ఉచిత హామీలతో మభ్యపెట్టిన కాంగ్రెస్

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, ఏప్రిల్ 26: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం విలేజ్, మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రాబోస్ నగర్ కాలనీలో పాదయాత్ర చేసి.. కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు.